వ్యవసాయ మార్కెట్ కమిటీ
పదవుల్లో అన్యాయం

మొయినాబాద్, జనవరి 1: హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నామినేటెడ్ పదవుల్లో మొయినాబాద్ మండలంలోని పార్టీ నాయకులకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు మోత్కుపల్లి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుడి మల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించిన పదవులు మొయినాబాద్‌కు ఇవ్వకపోవడం బాధ కరమన్నారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గానికి నాలుగు డైరెక్టర్ పదవులు వచ్చాయని, రెండు షాబాద్, ఒకటి చేవెళ్ల, ఒకటి శంకర్‌పల్లికి కేటాయించారని తెలిపారు. మండలానికి ఒకటి కూడా డైరెక్టర్ పదవి ఇవ్వలేదన్నారు. అదే విధంగా ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన నాయకులకు పదవులు కట్టబెడుతున్నారు తప్ప పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు పదవులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పార్టీలో ఏకపక్ష నిర్ణయాలు అవలంభిస్తున్నారని, అధిష్టానం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఒక్కసారైనా మొయినాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆవేదన అర్థం చేసుకుని పదవుల్లో న్యాయం చేయాలని కోరుతున్నామని తెలిపారు.

కడ్తాల్: మండల కేంద్రంలో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు

ఆమనగల్లు లో ముగ్గు వేస్తున్న చిన్నారులు

షాద్‌నగర్‌లోని చౌడమ్మగుట్ట వీరాంజనేయస్వామి దేవాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

నయా జోష్

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

ఆయా నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాల్లో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం అర్ధరాత్రి పెద్ద ఎత్తున కేక్‌లు కట్‌చేశారు. బుధవారం ఉదయం నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఇంటి వాకిళ్లలో మహిళలు, యువతులు ముగ్గులు వేశారు.

-న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

ఇబ్రహీంపట్నంలో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న చిన్నారి

అబ్దుల్లాపూర్‌మెట్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు, చిన్నారులు

ఆమనగల్లు : కేక్ కట్ చేస్తున్న మహిళలు

షాద్‌నగర్‌లో..

తట్టిఅన్నారంలో

రోడ్డు ప్రమాదం

మున్సిపాలిటీ పరిధి గౌరెల్లి వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు, తట్టిఅన్నారం నుంచి గౌరెల్లి వైపు వెళ్తున్న వాటర్ బబుల్స్ తీసుకెళ్తున్న వాహనం తట్టిఅన్నారం చౌరస్తా సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయం వద్ద బుధవారం ఉదయం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇన్నోవా కారు కొంతభాగం దెబ్బతినగా.. వాటర్ బబుల్స్ తీసుకెళ్తున్న వాహనం పల్టీలు కొట్టింది. ప్రమాదంలో వాహనం డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

- పెద్దఅంబర్‌పేట, జనవరి 1

బండ్లగూడ పరిధిలో ..

22 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

బండ్లగూడ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎలాంటి అవంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.అన్ని కూడలీలో పోలీసులు చెక్ పాయింట్ ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలను నిర్వహించారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మొత్తం 22 కేసులను నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ తెలిపారు.

మహర్ యుద్ధ వీరులకు ఘన నివాళి

చేవెళ్ల రూరల్, జనవరి 1 : మహర్ యుద్ధ వీరుల పోరాటం మరువలేనిదని సమతా సైనిక్ దళ్ నాయకులు అన్నారు. బుధవారం నగరంలోని లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సమతా సైనిక్ ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ మహర్ యుద్ధ వీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం సమతా సైనిక్ దళ్ నాయకులు మల్లేశ్, రామస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచనపల్లి రామచందర్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, చేవెళ్ల మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలూర్ గ్రామ జై భీమ్ యువజన సంఘం అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు ప్రవీణ్‌కుమార్, తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా రాజకీయ కమిటీ చైర్మన్‌గా రవిగుప్తా

ఆర్కేపురం, జనవరి 1 : ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా రాజకీయ కమిటీ చైర్మన్‌గా కొత్త రవి గుప్తా నియమిత్తులయ్యారు. బుధవారం తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మండలాలు, డివిజన్లల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు పోటీ చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ నెల 5న ఉదయం 10గంటలకు చంపాపేట్‌లో ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. తన నియామకానికి సహకరించిన తాడేపల్లి వెంకటేశంగుప్తా, గండె సురేశ్, కంటి కిరణ్ కుమార్, బద్రీనాథ్‌గుప్తాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాశెట్టి ప్రభాకర్, శ్రీనివాస్, రాహుల్‌గుప్తా ఉన్నారు.

కొత్త రవి గుప్తాకు నియామకపత్రాన్ని అందజేస్తున్న అమరవాది లక్ష్మీనారాయణ

విశ్వకర్మ మనుమయ సంఘం నియోజకవర్గ కమిటీ

ప్రధాన కార్యదర్శి శంకరాచారి

చంపాపేట, జనవరి 1 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో చేతి వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన విశ్వకర్మ మనుమయ సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పడకంటి వెంకటాచారి, రాయబండి శంకరాచారి అన్నారు. బుధవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలో నిర్వహించిన విశ్వకర్మ మనుమయ సంఘం ఎల్బీనగర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆదిమూల వెంకటాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లోజు శ్రీనివాసాచారి ముఖ్య అతిథులుగా హాజరై నియోజకవర్గ నూతన కమిటీని నియమించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పడకంటి వెంకటాచారి, రాయబండి శంకరాచారిలకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సంఘం ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా కమ్మరి, వడ్రంగి కుల సామాజికవర్గాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ముందుకు సాగుతామన్నారు. సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారికి, జిల్లా అధ్యక్షుడికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చిన్నోజు యాదవాచారి, ఉపాధ్యక్షుడు పోలోజు జంగాచారి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై యువత సందడి

96 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

మలక్‌పేట, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని మంగళవారం రాత్రి మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 96 మందిపై కేసులు నమోదు చేశారు. మంగళవారం రాత్రి పది గంటల నుంచి అర్ధరాత్రి వరకు దిల్‌సుఖ్‌నగర్ మారుతీమందిర్ బస్టాప్, గ్యాన్‌దీప్ టవర్స్ చౌరస్తా వద్ద నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ.. 96 మంది పట్టుబడ్డారు. మొత్తం 12 కార్లు, 84 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలోనే దివ్యాంగుల అభ్యున్నతి

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

బడంగ్‌పేట, జనవరి 1 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పీ. సబితాఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు ఎమ్మెల్యే ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన సంవత్సరం నుంచి ప్రజలకు అంతామంచి జరగాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆపదలో ఉన్న వారికి పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందేదని, ప్రస్తుత ప్రభుత్వం అదే మాదిరిగా అందజేయాలని అన్నారు. దివ్యాంగులకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం రద్దు చేసిన నిధులు తిరిగి కేటాయిస్తే నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ మంత్రికి శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు తినిపించారు. శాలువాలతో సత్కారించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్యా బీరప్ప, బీఆర్ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు అర్జున్, దీపికాశేఖర్‌రెడ్డి, శోభాఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాంరెడ్డి, స్వప్నాజంగారెడ్డి, పవన్‌కుమార్, స్వప్నావెంకట్‌రెడ్డి, భారతమ్మ, బీఆర్ఎస్ నాయకులు జలాల్‌పూర్ సునితబాల్ రాజ్, చంద్రయ్య, గీత, నిర్మల, లలితాజగన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి మంచి రోజులు వస్తాయి..

కందుకూరు : బీఆర్ఎస్ పార్టీకి ఉజ్వల భవిష్యత్ ఉందని, పార్టీకి మంచి రోజులు వస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ప్రజలు కాంగ్రెస్ నాయకుల మాయ మాటలను నమ్మి మోసపోయారని పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని మండలంలోని అగర్‌మియాగూడ గ్రామమాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు వడ్డెపల్లి రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తాను చాటాలని కోరారు.అనంతరం రేవంత్‌రెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన ఈర్లపల్లి జంగారెడ్డికి బ్యాటరీ సైకిల్‌ను అందజేశారు.మాజీ సీఎం కేసీఆర్ కృషి వల్ల రాష్ట్రంలో దివ్యాంగులకు గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో దన్నారం అంజిరెడ్డి, జయప్రకాశ్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమెల్యే సబితాఇంద్రారెడ్డి

కమ్ముకున్న పొగమంచు

మున్సిపాలిటీలో బుధవారం ఉదయం పొగమంచు కమ్ముకున్నది. కుత్బుల్లాపూర్, గౌరెల్లి, తట్టిఅన్నారం, కుంట్లూరు తదితర ప్రాంతాల్లో తెల్లవారుజామున నుంచి దాదాపు 10 గంటల వరకు పొగమంచు కమ్మింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో తట్టిఅన్నారంలో పొగమంచు ఇలా కనిపించింది.

- పెద్దఅంబర్‌పేట, జనవరి 1

సేవాలాల్ యువసేన జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

శ్రీకాంత్‌నాయక్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్

కడ్తాల్, జనవరి 1: సేవాలాల్ యువసేన జిల్లా అధ్యక్షుడిగా మన్యగూడ తండాకు చెందిన బానావత్ శ్రీకాంత్‌నాయక్ నియామకమయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబునాయక్ నుంచి నియామక పత్రం అందుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురామ్‌రాథోడ్, ప్రధాన కార్యదర్శి రేఖ్యానాయక్, ఉపాధ్యక్షుడు రవి నాయక్, భూక్యానాయక్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా కోశాధికారిగా బద్రీనాథ్ గుప్తా

బద్రీనాథ్‌గుప్తాకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మంచాల, జనవరి 1: ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా కోశాధికారిగా మంచాల మండలం బోడకొండ గ్రామానికి చెందిన వనపర్తి బద్రీనాథ్‌గుప్తాను నియమించారు. బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ నియామక పత్రాన్ని బద్రీనాథ్‌గుప్తాకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్, మాజీ అధ్యక్షుడు వెంకటేశం, కిరణ్ పాల్గొన్నారు.

ఉద్యోగం రావడంలేదని గృహిణి ఆత్మహత్య

శేరిలింగంపల్లి, జనవరి 1: ఉద్యోగం రావడంలేదని ఒత్తిడికి గురైన ఓ గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో నివసించే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి పప్పాల సతీశ్, వనజాల బాలమణి దంపతులు. కాగా బాలమణి.. గత 10 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం పరీక్షలు రాస్తుంది. ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనోవేధనకు గురైంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త సతీశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు

పాఠశాలే పునాది

ఆర్కేపురం, జనవరి 1 : విద్యార్థుల భవిష్యత్‌కు పాఠశాలే పునాది అని ఎన్ఆర్ఎస్సీ, ఐఎస్ఆర్ఓ శాటిలైట్ స్టేషన్ ఇంజినీర్ గోడి వెంకటరమణ అన్నారు. బుధవారం భాష్యం పాఠశాల దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్ 12వ వార్షికోత్సవ వేడుకలను ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై మా ట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల మానసిక పరిపక్వతతోపాటు శారీరక దృఢత్వం పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు.

స్పెషల్ డ్రైవ్‌లో కేసులు నమోదు

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 1 : నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి 10 నుంచి బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నాంపల్లి రైల్వే స్టేషన్, అసెంబ్లీ మెట్రో స్టేషన్ ప్రాంతాల్లో సీఐ టి. కిరణ్‌కుమార్ నేతృత్వంలో ఎస్సైలు శివకుమార్, అహ్మద్ పాషా సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో 35మంది వాహనదారులు మోతాదుకు మించి మద్యం సేవించి పట్టుబడ్డారు. 31మంది టూ వీలర్, ఒకటి త్రీ వీలర్, ముగ్గురు కార్లు నడుపుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ప్రత్యేక డ్రైవ్‌లో 20 మంది సిబ్బంది పాల్గొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు.

తాగారు.. దొరికారు
సుల్తాన్‌బజార్‌లో 47 డీడీ కేసులు

సుల్తాన్‌బజార్ : నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు నేతృత్వంలో 47 కేసులు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కాచిగూడ : ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి లింగంపల్లి ఎక్స్‌రోడ్, బర్కత్‌పుర తెలంగాణ యువతి మండలి సమీపంలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 33 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడగా.. 31 ద్విచక్రవాహనాలు, 2 కార్లు ఉన్నాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, జనవరి 1 : విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డీఈ కేకే రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్చరర్స్ కాలనీ, ఆల్ ఇండియా రేడియో స్టేషన్, హయత్‌నగర్, కల్వంచ, రాఘవేంద్ర కాలనీ, మదర్‌డైరీ, ఆనంద్‌నగర్, కొత్తపేట్, విద్యుత్‌నగర్, మోహన్‌నగర్, లక్ష్మీనగర్ కాలనీ, విజయపురి, ఆర్కేపురం, న్యూ మారుతీనగర్, వీరభద్రనగర్, ఫణిగిరి కాలనీ, సాయి కాలనీ, చిత్రలేఅవుట్, బీరప్ప దేవాలయం, సీతారామపురం, విజయనగర్ కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

అల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో..

మాదాపూర్, జనవరి 1: ఫీడర్ మరమ్మతుల కారణంగా అల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ రాకేశ్ గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇం దులో భాగంగా పద్మావతినగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని జేకే పాయింట్ హోటల్, రాణా ప్రతాప్ నగర్, ఆర్‌కే సొసైటీ, థామస్ స్కూల్ సమీపంలో, శివ బస్తీ ఏరియా, కేఎస్ నగర్, దుర్గా ఏరియా వంటి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 3 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు తెలిపారు.